ప్రజాశక్తి
సోమవారం 20 నవంబరు 2023 5
శ్రీకాకుళం

ఉపాధి శిక్షణా కోర్సుల్లో ప్రవేశాలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్ల మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో కంప్యూటర్ అకౌంటెన్సీ, టైలరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళా అభ్యర్థులు శిక్షణలో చేరేందుకు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అదనపు సమాచారానికి 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బూర్జ మండలం కొల్లివలస, సింగన్నపాలెం మధ్య అసంపూర్తిగా హైలెవల్ కెనాల్ పనులు

హైలెవల్ కెనాల్

సకాలంలో పూర్తయ్యేనా?

- స్ట్రక్చర్ల నిర్మాణం 56 శాతమే పూర్తి
- కోర్టు కేసుతో బూర్జలో నిలిచిన కాలువ తవ్వకాలు
- భూసేకరణ చెల్లింపుల్లో జాప్యం
- డిసెంబరు 31 నాటికి ముగియనున్న ఒప్పంద గడువు

హైలెవల్ కెనాల్ పనులను ఎన్నికల షెడ్యూల్ లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. 2017లో మొదలైన పనులు 2020 నాటికల్లా పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 80 శాతమే పనులు పూర్తయ్యాయి. ఒప్పందం ప్రకారం ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 56 శాతం మేరే స్ట్రక్చర్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరోవైపు బూర్జలో కోర్టు కేసుల నేపథ్యంలో కాలువ తవ్వకాలు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల కాలువ తవ్వకాలకు సేకరించిన భూముల కు చెల్లింపులు చేపట్టలేదు. దీంతో సకాలంలో పనులు పూర్తి కావడంపై అనేక సందేహాలు నెలకొన్నాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార, నాగావళి నదుల అనుసంధానంలో భాగంగా హిరమండలం రిజర్వాయరు గట్టుకు రెండు తూములు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 33.58 కిలోమీటర్ల మేర నారాయణపురం వరకు కాలువ తవ్వాల్సి ఉంది. హిరమండలం వద్ద నీటిని సరఫరా చేసే చోట 43.7 మీటర్ల స్థాయిలో, నారాయణపురం ఆనకట్ట వద్ద కాలువ కలిసేచోట 29.09 మీటర్లు నిర్మించేలా డిజైన్ చేశారు. తద్వారా ఏటవాలుగా నీరు ప్రవహించి ఆనకట్టకు చేరుతుంది. నదుల అనుసంధానం పూర్తి చేస్తే ఎల్ఎన్పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లోని ఐదు వేల ఎకరాలకు సాగునీరందుతుంది. దీంతో పాటు నారాయణపురం ఆనకట్ట ప్రధాన కాలువల కింద ఉన్న 37,053 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

పెరిగిన ప్రాజెక్టు వ్యయం

వంశధార, నాగావళి నదుల పనులను రూ.84.90 కోట్ల వ్యయంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పివి రమణయ్య అండ్ కంపెనీకు రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించిన ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 31 పూర్తి చేసేలా పొడిగించింది. అంచనా వ్యయాన్ని సవరించి రూ.145.34 కోట్లకు పెంచింది. ఇప్పటివరకు రూ.85.71 కోట్లను వెచ్చించారు.

భూసేకరణ చెల్లింపుల్లో జాప్యం

హైలెవల్ కెనాల్ పనులకు సంబంధించి భూసేకరణ పూర్తయినా ప్రభుత్వం నేటికీ రైతులకు డబ్బులు చెల్లించలేదని తెలుస్తోంది. కాలువ తవ్వకాలకు మరో 49.23 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించినా... ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదు. ఇందు కోసం రూ.8.26 కోట్ల కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదని తెలుస్తోంది.

పనులు సకాలంలో పూర్తి కావడం సందేహమే

బూర్జ మండలం చినలంకాంలో కాలువ నిర్మాణం కోసం దేవాదాయ, ధర్మాదాయశాఖకు చెందిన సుమారు 7.5 ఎకరాలు అవసరం పడింది. వంశధార అధికారులు పరిహారం కింద దేవాదాయ, ధర్మాదాయశాఖకు రూ.1.50 కోట్లు చెల్లించేశారు. భూముల్లో 13 మంది రైతులు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నారు. చట్టం ప్రకారం పరిహారంలో 60 శాతం దేవాదాయ, ధర్మాదాయశాఖకు, 40 శాతం కౌలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. కౌలు రైతులకు పరిహారం చెల్లింపునకు సిద్ధమవుతున్న తరుణంలో ఆ భూములకు దేవాలయానికి ఇచ్చిన ధర్మదాత పరిహారం ఇవ్వాల్సి వస్తే తనకు ఇవ్వాలని, లేకుంటే దేవాదాయశాఖకు చెందాలంటూ కోర్టును ఆశ్రయించాడు. దీంతో బూర్జ మండలం చినలంకాం పరిధిలో 700 మీటర్ల మేర కాలువ తవ్వకాలకు బ్రేక్ పడింది. నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గంలో కాలువ నిర్మిస్తామని అధికారులు చెప్తున్నారు. పనులు జరుగుతున్న తీరు, భూ సేకరణ చెల్లింపుల్లో జాప్యం వంటి అంశాల వల్ల కెనాల్ పనుల పూర్తికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో ఒప్పందం ప్రకారం ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

3, 4న జాతీయ సెమినార్

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

డిసెంబరు 3,4 తేదీల్లో శ్రీకాకుళంలో జాతీయ సెమినార్ను నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. నగరంలోని స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సిఐటియు జాతీయ నాయకులు పర్సా సత్యనారాయణ శత జయంత్యుత్సవాలు సందర్భంగా సిఐటియు ఆధ్వర్యాన్న నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ జాతీయ సెమినర్కు సిఐటియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, రాష్ట్రంలో వివిధ కార్మికోద్యమ నాయకులు, కార్మికులు హాజరు కానున్నారని తెలిపారు. పాలకులు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, సమస్యలు పరిష్కారం, హక్కుల పరిరక్షణకు సిఐటియు అనేక పోరాటాలు చేస్తోందని చెప్పారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, రైల్వే, బిఎస్ఎన్ఎల్, బ్యాంకులు, ఇన్సూరెన్స్, పోస్టల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్వహిస్తోందని చెప్పారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సిఐటియు నిర్వహిస్తున్న ఐక్య ఉద్యమం వల్లే ప్లాంట్ ప్రయివేటీకరణ మూడేళ్లుగా జరగలేదని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడుతోంది సిఐటియునేనని అన్నారు. ఉద్యోగులకు మెరుగైన పిఆర్సి ఇవ్వాలని చేసిన పోరాటాలకు మద్దతుగా నిలబడిందన్నారు. కరోనా సమయంలో అనేక సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు సిఐటియు నిర్వహించిందని గుర్తుచేశారు. కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్ మార్చి కార్మికులను ఆధునిక బానిసలుగా మారుస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.సుధ, ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.అమరావతి, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, ఎన్.వి.రమణ, కె.సూరయ్య, ఎన్.గణపతి, హెచ్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నర్సింగరావు

30న గురజాడ వర్ధంతి

మాట్లాడుతున్న కవులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం నగరంలో ఈ నెల 30న గురజాడ వర్ధంతి నిర్వహించాలని నగరానికి చెందిన పలు సాహితీ సంస్థలు నిర్వహించాయి. శ్రీకాకుళం నగరంలోని స్థానిక కథానిలయం నిర్వహించిన సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు అధ్యతన కవులు, రచయితల సంఘాలు సమావేశం నిర్వహించాయి. ఇందుకు సంబంధించి ఒక కార్యాచరణ రూపొందించాయి. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, అరసం రాష్ట్ర అధ్యక్ష, వర్గ సభ్యులు నల్లి ధర్మారావు మాట్లాడుతూ గురజాడ రచనలు 150 ఏళ్ల కిందటవే అయినా నేటి పరిస్థితులకు ప్రతిబింబిస్తాయని చెప్పారు. శ్రీకాకుళం సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి దాసరి రామచంద్రరావు మాట్లాడుతూ వర్ధంతి సభలో గురజాడ శాస్త్ర విజ్ఞానం మహిళా సాధికారత, కుల వివక్ష, నిరుద్యోగం, ఉపాధి, ఆర్థిక వృద్ధి వంటి అంశాలను చర్చిస్తామని చెప్పారు. జనసాహితి, తెలుగు రచయితల వేదిక ప్రధాన కార్యదర్శులు పి.మోహనరావు, ఆర్.వి.రమణమూరి మాట్లాడుతూ కార్యక్రమంలో విద్యార్థులను యువజనులను భాగస్వాములను చేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. కార్యక్రమ నిర్వహణకు సహకరిస్తామని గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, బాల కథానిలయం బాధ్యులు ఉమాకవి అన్నారు. ప్రముఖ కవులు కంచరాన భుజంగరావు, నెట్టిమి రమణారావు, తంగి ఎర్రమ్మ, ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, చింతాడ తిరుమలరావు మల్లి తదితరులు పాల్గొన్నారు.

కష్టాల సుడిలో 'కార్యేషు దాసి'

- చీము పట్టి కాలు పోగొట్టుకున్న భర్త
- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుమారుడు
- ఒంటరి పోరాటం చేస్తున్న మాతృమూర్తి

ఇద్దరు పిల్లలతో ఆ కుటుంబం సాఫీగా సాగుతున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదంలో కొడుకు ప్రాణాలు కోల్పోతే, కాలికి తగిలిన గాయం వ్యాధిగా మారి చివరికి భర్త కాలునే తొలగించాల్సి వచ్చింది. మరోవైపు వృద్ధాప్య దశలో ఉన్న అత్త మంచానికే పరిమితమైంది. దీంతో అటు ఆస్పత్రిలో భర్త, మంచంపై ఉన్న అత్తకు సపర్యలు చేస్తుంది ఆ ఇల్లాలు. కనీసం ఇల్లు నడిపేందుకూ డబ్బులు లేక ఆర్థిక సమస్యలు ఎదు ర్కొంటోంది. ఓవైపు కన్న కొడుకు పోయాడన్న దు:ఖం లో ఉండగానే, ఇటు భర్త కాలూ తీసివేయడంతో ఆమె పరిస్థితి దయనీయంగా మారింది. అటు వారిని చూసుకోలేక ఇటు ఎవరి వద్ద చేయి చాచలేక దాతల సాయం కోసం ఎదురుచూపులు చూస్తోంది ఆ మాతృమూర్తి.

ప్రజాశక్తి- కవిటి

వివరాల్లోకి వెళ్తే... కవిటి మండలం వరకకు చెందిన ఎన్ని వినాయకరావు ఉపాధి నిమిత్తం విశాఖపట్నంలో ఓ ప్రయివేట్ పాఠశాలలో బస్సు డ్రైవరుగా పనిచేస్తుండగా, అతని భార్య సుజాత మరో ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయనిగా పనిచేస్తుండేవారు. తమకు వచ్చిన ఆదాయంతో వినాయకరావు తల్లి, తమ ఇద్దరు పిల్లలతో సంసారం సాగిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో కొడుకు దూరమయ్యాడు. అక్కడికి కొద్ది రోజులకే వినాయకరావు కాలుకు తగిలిన చిన్న గాయం పెద్దదిగా మారి పుండుగా తయారైంది. కాలును పరీక్షించిన వైద్యులు కాలు తొలగించకపోతే ప్రాణానికే ప్రమాదమని వినాయకరావు కాలు తొలగించారు. దీంతో వినాయకరావు తల్లి ఇటు ఇంట్లో పరిస్థితులు, అటు వృద్ధాప్య సమస్యలతో మంచం పట్టింది. అప్పటి నుంచి అటు ఆస్పత్రిలో ఉన్న భర్త, ఇంట్లో మంచంపై ఉన్న అత్తకు సుజాతే దిక్కైంది. ఓవైపు ఊపిరి సలపని ఒత్తిడి, మరోవైపు ఉపిరాడనివ్వని ఆర్థిక సమస్యలు సుజాతను చుట్టుముట్టాయి. ఇప్పటి వరకూ తనకాళ్లపై తాను నిలబడి కుటుంబానికి చేయూతనిచ్చిన ఆమెకు ఇప్పుడు వేరేవారిని ఆశ్రయించేందుకు మనసు అంగీకరించడం లేదు. కానీ, అటు ఆస్పత్రి ఖర్చులు, ఇటు అత్తకు మందులతో పాటు పూట గడవడం కూడా కష్టంగా మారింది. 'కార్యేషు దాసి.. కరణేషు మంత్రి' అంటూ చెప్పినట్టు భర్త, అత్తకు సపర్యలు చేస్తున్న సుజాత ఆర్థిక వనరులకు దూరమై ప్రస్తుతం దాతల సాయం కోసం భారమైన హృదయంతో ఎదురుచూస్తోంది. దయార్ద్ర హృదయాలు తమ ఎస్బిఐ అకౌంట్ నంబరు 1644706499 (ఐఎఫ్ఎస్సి 0010574)కు కానీ, ఫోన్ పే నంబరుకు 7780578629 కానీ ఆర్థిక సహాయం అందించాలని వేడుకుంటోంది.

భర్త వినాయకరావుతో సుజాత

22న ఐటిఐలో జాబ్మేళా

ఎచ్చెర్ల : ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈ నెల 22న వృత్యంతర శిక్షణ, జాబ్మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, పిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ ట్రేడ్ల్లో ఉత్తీర్ణులైన.. 25 ఏళ్లలోపు వయసు కలిగిన అభ్యర్థులు హాజరుకావ చ్చునని చెప్పారు. పిట్టర్ 120, ఎలక్ట్రీషియన్ 120, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ ట్రేడుల్లో 50 చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.14,215 శిక్షణ భృతితో పాటు ఇఎస్ఐ, ఓటీ సదుపాయాలు ఉంటాయని స్పష్టం చేశారు.

దరఖాస్తులకు ఆహ్వానం

అరసవల్లి : ఉత్తమ పర్యాటక ప్రాంతాలకు సంబంధించి పురస్కారాలు అందించేందుకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతికశాఖ అధికారి ఎన్.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. వారసత్వ, వ్యవసాయ పర్యాటకం, కళాఖండాలు, శక్తిమంతమైన గ్రామాలు, తదితర రంగాలకు చెందిన వారు www.rural.tourism.gov.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపికైన గ్రామాలకు బెస్ట్ రూరల్ టూరిజం రాష్ట్ర, జాతీయస్థాయిలో పురస్కారాలు అందజేస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 6309942033 నంబరును సంప్రదించాలని కోరారు.

అప్రజాస్వామిక ప్రభుత్వాన్ని గద్దె దించాలి

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రాన్ని అడ్డదిడ్డంగా అప్రజాస్వామిక పద్ధతిలో పరిపాలన చేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిన అవసరం వచ్చిందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని మందపల్లి పంచాయతీలో అనిల్ సాహు నేతృత్వంలో వైసిపికి చెందిన నాయకులు ఎమ్మెల్యే బెందాళం అశోక్ సమక్షంలో ఆదివారం టిడిపిలోకి చేరారు. వీరికి ఎంపీ టిడిపి కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో ఆంక్షలు పెట్టి అనేక మంది ప్రజలకు పథకాలు అందించకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రెండు బలమైన పార్టీలు టిడిపి, జనసేన కలిసి పోటీ చేయాలన్న ఆలోచన ప్రజల నుంచి వచ్చిందేనని అన్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు వద్ద నుంచి జనసేన అధినేత పవణ్ కళ్యాణ్ ప్రకటించిన పొత్తు జగన్ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని అన్నారు. అప్పటి నుంచి సిఎం జగన్ ఎలగైనా పొత్తును విడదీయడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి గురించి మాట్లాడే సత్తా లేదని జగన్... ప్రతి సమావేశంలోనూ చంద్రబాబునాయుడు విమర్శించడానికి తప్ప... మరో మాట లేదని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ పథకాల్లో కోతలు విధిస్తు మోసం చేస్తున్నారని విమర్శించారు. చేయూత కేవలం 45 నుంచి 60లోపు వరకే పరిమితం చేయడం దారుణమన్నారు. అంతకుముందు బాలకృష్ణాపురంలో ఎంపీ నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దక్కత ఢిల్లీరావు, జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జి దాసరి రాజు, దాసుబాబు, సహదేవ్రెడ్డి, చంద్రశేఖర్, మణిచంద్ర, ప్రకాష్, సీపాన వెంకటరమణ, లోహిదాస్, కాళ్ల గోపి, కామేశ్వరరావు, కాళ్ల జయదేవ్, పద్మనాభం, జాని, కొండ శంకరరెడ్డి పాల్గొన్నారు.

పార్టీ కండవ వేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లోకే డబ్బులు

- ఈ-క్రాప్లో నమోదైన పంటనంతటినీ తీసుకుంటాం
- 390 చోట్ల కేంద్రాల ఏర్పాటు
- గతేడాది సమస్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు
- జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీనివాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

భూమి ఎవరిదైనా ఆ పొలంలో ఎవరు ధాన్యం పండిస్తే వారి ఖాతాల్లోకే నేరుగా డబ్బులు జమ అవుతాయని జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ కె.శ్రీనివాస్ అన్నారు. గతంలో భూమి సొంతదారుడి ఖాతాలో డబ్బులు జమ కావడం, అవి తీసి కౌలు రైతుల రైతులకు ఇచ్చే పరిస్థితి ఉండేదని అన్నారు. ఈ సంవత్సరం అలా ఉండదని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్లో ధాన్యం కొనుగోలు లక్ష్యం అంటూ పెట్టుకోలేదని, రైతు పండించిన పంటనంతటినీ కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లకు ఎప్పటిమాదిరిగానే ఈ-క్రాప్ లో నమోదైన పంటనే కొనుగోలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకనుగుణంగా ధాన్యం తీసుకొచ్చి రైతు భరోసా కేంద్రాలకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇస్తేనే మద్దతు ధర దక్కుతుందని చెప్పారు. ధాన్యం కొనుగోలులో గతేడాది తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం సేకరణకు పాత నిబంధనలే అమలు చేస్తున్నా... అందులో లోపాలను సవరించి రైతులకు న్యాయం చేస్తామని చెప్తున్నారు. ధాన్యం కొనుగోలు, మిల్లులకు తరలింపు, రైతులకు చెల్లింపు వంటి అంశాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వివరించారు.

? ధాన్యం కొనుగోలు ఏర్పాట్లను వివరిస్తారా?

జిల్లా వ్యాప్తంగా 390 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను మూడు కేటగిరీలుగా విభజించారు. 2 వేలు పైబడి ధాన్యం సేకరించే అవకాశం ఉన్న కేంద్రాలను ఎ కేటగిరిగా, వెయ్యి నుంచి 2 వేలు టన్నుల లోపు వరకు కొనుగోలు చేసేవాటిని బి కేటగిరిగా విభజించారు. అదేవిధంగా వెయ్యి టన్నుల కంటే తక్కువ ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉన్నవాటిని సి కేటగిరిగా నిర్ణయించారు. జిల్లాలో ఎ కేటగిరిలో 182, బి కేటగిరిలో 176, సి కేటగిరిలో 32 కేంద్రాలు ఉన్నాయి. కేంద్రాల్లో ధాన్యం నాణ్యతా ప్రమాణాల పరిశీలన, వివరాలు ఆన్లైన్లో నమోదు వంటి అవసరాల కోసం టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికపై 1170 మందిని నియమించాం.

? ఈ ఏడాది ఎంతమేర ధాన్యం మార్కెట్లోకి వస్తుందని భావిస్తున్నారు?

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్లో 3,51,843 ఎకరాల్లో వరి వేశారు. ఇందులో 3,50,765 ఎకరాలకు పంటల క్రాపింగ్ జరిగింది. 3,34,330 ఎకరాలకు ఈకెవైసి పూర్తయింది. ఈ సంవత్సరం 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేసి చెప్పారు. అందులో 7,87,447 మెట్రిక్ టన్నులు మార్కెట్లోకి వస్తుందని భావిస్తున్నాం. ధాన్యం కొనుగోలుకు లక్ష్యం అంటూ పెట్టుకోలేదు. రైతు పండించిన పంటనంతటినీ కొనుగోలు చేస్తాం.

? జిల్లాలో కొంత మంది మిల్లర్లు ఒడిశా ధాన్యం కొంటున్నారన్న ఆరోపణలు చాలా ఏళ్లుగా ఉన్నాయి. దీనిని అధిగమించడానికి ఏం చేయబోతున్నారు.

ఒడిశా ధాన్యం కొనుగోలు చేయకుండా అన్ని రకాల కట్టడి చర్యలు తీసుకుంటున్నాం. ధాన్యం రవాణ చేసే వాహనాలకు ఈ సంవతసరం కొత్త జిపిఎస్ పరికరాలను అమర్చుతున్నాం. కళ్లాల నుంచి మిల్లులకు ధాన్యం తీసుకువెళ్లే వాహనాలకు వీటిని పెడుతున్నాం. జిల్లాలో 5 వేలు పరికరాలు అవసరమవుతాయని గుర్తించారు. ఇప్పటివరకు 600 వరకు అందుబాటులో ఉన్నాయి.

? గతేడాది కొన్ని కొనుగోలు కేంద్రాలు తమ లక్ష్యమైపోయిందంటూ ధాన్యం తీసుకునేందుకు నిరాకరించాయి. వీటిని ఈ ఏడాది ఎలా అధిగమించనున్నారు?

ధాన్యం కొనుగోలులో గతేడాది ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. మిల్లుల మ్యాపింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రైతులు తమకు సమీపంలో ఉన్న మిల్లులకు ధాన్యం ఇచ్చేలా చర్యలు చేపడుతున్నాం. ధాన్యం కొనుగోలుకు లక్ష్యం అంటూ పెట్టుకోలేదు కాబట్టి కొనుగోలు కేంద్రాలు తమ లక్ష్యమైపోయాయని చెప్పేందుకు ఆస్కారం ఉండదు.

? ధాన్యం మర ఆడించేందుకు ఎన్ని మిల్లులను ఎంపిక చేశారు?

మర ఆడించేందుకు 255 మిల్లులను ఎంపిక చేశాం. వీటిలో 244 సార్టెక్స్ ఫోర్టుఫైడ్ మిల్లులు, 11 నాన్ సార్టెక్స్ ఉన్నాయి. మర ఆడించేందుకు ఇస్తున్న ధాన్యం విలువకు సమానమైన బ్యాంకు గ్యారంటీలను మిల్లర్ల నుంచి తీసుకునేందుకు వారితో చర్చిస్తున్నాం. ఇవన్నీ పూర్తి చేసి మరో రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తాం.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
SUCCESSION OP.No.14/2023

Between:
1) Baratam Narayana Rao
2) Potnuru Umamaheswari
3) Baratam Bharathi Devi
4) Sahini Gowri ......Petitioners.
And
-Nil- .....Respondents.

GENERAL PUBLIC NOTICE

The public in general are hereby called upon to raise any objections to issue "Succession Certificate" in favour of the above named petitioners in the above numbered S.O.P.No.14/2023 on the file of the Honourable Principal Senior Civil Judge at Srikakulam. In the event of if any successors are there such persons may appear before the above said court with necessary documents if any either in person or through an Advocate to raise objections if any on **22-12-2023 at 10- 30A.M.** before the above mentioned Court. Otherwise the Honourable Court will pass decree by issuing "Succession Certificate" in favour of the above named Petitioners to declare them as only successors to the deceased BARATAM SANYASI.

NULU SITA RAMA RAO,
Advocate & Notary,
Balaga, Srikakulam.
Cell No.9490713705

Srikakulam,
Dt.19-11-2023

బహిరంగ ప్రకటన

నా క్లైంట్ అయిన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలము బమ్మిడివానిపేట గ్రామము కాపురస్తురాలు తమ్మినేని నారాయణరావు గారి భార్య విజయలక్ష్మి గారు యిచ్చిన భోగాట్టాపై జన యావన్మందికీ తెలియజేయునది ఏమనగా..

నా క్లైంట్ తన ప్రామిసరీ నోటు బాకీ డబ్బును రాబట్టుకొనే నిమిత్తము శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలము బమ్మిడివానిపేట గ్రామము కాపురస్తుడు పొన్నాడ బాలాజీరావు గారి కుమారుడు పూర్ణ చంద్ర రావు గారి పై శ్రీకాకుళం స్పెషల్ జ్యుడిసియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ వారి కోర్టు నందు ఓ.యస్.నెం. 579/2023 గా దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావానందు ఐ.ఏ.నెం.343/2023గా గల పిటీషనుపై క్రింది షెడ్యూలు ఆస్తిని ప్రథమ జప్తునకు (ఎటాచ్మెంట్) దాఖలు చేయడమైనది. కాగా శ్రీ కోర్టు వారు క్రింది షెడ్యూలు ఆస్తి పై ప్రథమ జప్తు (ఎటాచ్మెంట్) మంజూరు చేస్తూ నోటీసు అందిన మూడు రోజులలోగా మూడవ పార్టీ సెక్యూరిటీ సమర్పించని యెడల సదరు ఆస్తిపై జప్తును (ఎటాచ్మెంట్) ఖరారు చేయుదురని యిందుమూలముగా తెలియజేయడమైనది. కాబట్టి క్రింది షెడ్యూలు ఆస్తిపై ఎట్టి క్రయ విక్రయాలు, లావాదేవీలు జరిపించకూడదని అలాగున జరిపినచో సదరు క్రయవిక్రయములు చట్ట రీత్యా చెల్లనేరవు ఒకవేళ అటువంటి లావాదేవీలు జరిపినవారిపై నా క్లయింట్ తగు సివిలు, క్రిమినల్ చర్యలు తీసుకొందురని యిందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియచేయడమైనది.

షెడ్యూలు ఆస్తి వివరము

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలము, పొందూరు సబ్ డిపో, దోమాం గ్రామ పంచాయతి ఎస్.ఎం.పురంపేట రెవెన్యూ గ్రామము లెక్కదాఖలా సర్వే నెం.24/9 అసెస్మెంట్ నెం. 14 గల ఆర్.సి.సి. స్లాబ్ ఇల్లుకు తూర్పు – పడమరలకు 23.4 అడుగులు, ఉత్తర–దక్షిణలకు 59.6 అడుగులు కొలతల గల ఇంటికి హద్దులు:
తూర్పు : సనపల శిమ్మయ్య మరియు యితరుల ఖాళీ స్థలము.
దక్షిణమున : పంచాయతీ సి.సి. రోడ్.
పడమర : పైడి కృష్ణారావు మరియు ఇతరుల ఖాళీ స్థలము.
ఉత్తర : తమ్మినేని పావని ఇల్లు ఆవరణ స్థలము.

సం/- చింతాడ తిరుపతిస్వామి
న్యాయవాది
సెల్: 9441012425

శ్రీకాకుళం.
తే19-11-2023.

ఎన్నికైన యుటిఎఫ్ సభ్యులు

యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పొందూరు

మండల శాఖ యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పి.జగదీశ్వరరావు, అధ్యక్షులుగా జి.గోపాలరావు, సహాధ్యక్షులుగా ఎన్.కిషోర్‌కుమార్, మహిళా అధ్యక్షులుగా అనురాధజ్యోతి, ప్రధాన కార్యదర్శిగా కె.వి.ఎం.సత్యనారాయణ, కోశాధికారిగా జి.వాసుదేవరావు, కార్యదర్శులుగా పి.కృష్ణ, పి.రవి, పి.కృష్ణారావు, డి.శివజ్యోతి, పి.తేజేశ్వరరావు, కె.ఉత్తరలక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా జి.గోపాలరావు, కెవిఎం.సత్యనారాయణ, ఎన్.కిషోర్‌కుమార్, పి.సత్యనారాయణ, మధుబాబు, కె.మల్లేశ్వరరావు, కె.లోకనాథం, బి.రాజు, జి.మురళీమోహనరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక పరిశీలకులుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు వ్యవహరించారు.

ర్యాలీలో పాల్గొన్న అప్పలనాయుడు

అంబేద్కర్ చైర్‌ను నెలకొల్పాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఆవరణలో అంబేద్కర్ చైర్‌ను తక్షణమే నెలకొల్పాలని ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి నాయకులు, ఉత్తరాంధ్ర టిడిపి శిక్షణా శిబిరం మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఎచ్చెర్ల హెడ్‌క్వార్టర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఆవరణలో అంబేద్కర్ చైర్‌ను నెలకొలపాలని కోరుతూ అంబేద్కర్ జాతర నిర్వాణ కమిటీ ఆధ్వర్యాన జాతా ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ముందుగా స్థానిక దళితవాడలోని అంబేద్కర్ సామాజిక భవనం నుంచి ఆరంభమై ఇక్కడి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఆవరణ వరకు దళితులతో ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. తప్పెట గుళ్లు, కోలాటం, డప్పు వాద్యాలతో ర్యాలీ నిర్వహించడంతో అందరినీ ఆకర్షించింది.

లైఫ్ సర్టిఫికెట్ మేళాలో పాల్గొన్న మాజీ సైనికులు

మాజీ సైనికులకు లైఫ్ సర్టిఫికేట్ మేళా

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో కొత్తరోడ్డు వద్ద నున్న మిలటరీ క్యాంటీన్ వద్ద జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో మాజీ సైనికులకు లైఫ్ సర్టిఫికెట్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికుల కొరకు ఈ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేళాకు సహకరించిన ఆడమ్ కమాండెంట్ కల్నల్ విక్రాంత్ పాండేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. లైఫ్ సర్టిఫికెట్ మేళాలో జిల్లా నలుమూలం నుంచి సుమారు 25 మంది మాజీ సైనికులు, వీరనారీమణులు, వీరమాతలు, సైనిక వితంతువులు పాల్గొని లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించినట్లు పూర్ణచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల హానరరీ ప్రెసిడెంట్ తమ్మినేని కృష్ణారావు, వైస్ ప్రెసిడెంట్ విరోదుల సూర్యనారాయణ, సీనియర్ ఎయిర్ వెటరన్ ఎ.వి. జగన్మోహనరావు, క్యాంటీన్ మేనేజర్ తర్రా కృష్ణారావు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

రణస్థలం: హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని హమాలీ కార్మికుల రాష్ట్ర ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిన్నారావు, కె.సూరయ్య డిమాండ్ చేసారు. హమాలీ, కళాసీ కార్మికులకు పని భద్రత, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలని, సమగ్ర చట్టం అమలు కోసం వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరారు. ఆదివారం కళాసీల సమావేశం రణస్థలంలో జరిగింది. ఇటీవల మరణించిన కళాసి మన్నెల లక్ష్ముకు సంతాపం తెలియజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మార్కెట్ యార్డులు, బజారు కొట్లు, పండ్లు, కూరగాయల మార్కెట్లు, ఆర్‌టిసి, ప్రభుత్వ, ప్రైవేటు గోడౌన్లు, ఎఫ్‌సిఐ, సివిల్ సప్లయిస్, రైస్‌మిల్లు తదితర సంస్థల్లో సుమారు 6 లక్షల మంది ముఠా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరికి పని భద్రత లేదని, కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. హక్కులసాధనకు హమాలీ, ముఠా, కళాసీ కార్మికులు సంఘటితంగా పోరాడాలని కోరారు.సమావేశంలో కళాసి సంఘం నాయుకులు మహాలక్ష్మ నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వసంతరావు

క్షత్రియులకు ప్రాధాన్యత కల్పించాలి

కవిటి: రాబోయే ఎన్నికల్లో అగ్నికుల క్షత్రియులకు ప్రాధాన్యత కల్పించిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు అల్టిమేటం జారీ చేశారు. కవిటి రోటరీ భవనంలో అగ్నికుల క్షత్రియ సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో అగ్నికుల సంఘ రాష్ట్ర డైరెక్టర్ జుత్తు నీలకంఠం, జిల్లా అధ్యక్షుడు గొరకల వసంతరావు మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో జనాభా పరంగా మొదటి స్థానం, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ద్వితీయ స్థానంలో ఉన్న అగ్నికుల క్షత్రియులను ఇప్పటివరకు సముచిత స్థానం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో అగ్నికుల క్షత్రియులకు జిల్లాలో ఒక ఎమ్మెల్యే, రెండు ఎమ్మెల్సీ, నాలుగు జెడ్‌పిటిసి, రెండు ఎంపిపి పదవులతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పులకల శ్రీరాములు, కవిటి అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు పొల్లాయి లక్ష్మణమూర్తి, జిల్లాలోని అగ్నికుల క్షత్రియ సంఘం ముఖ్య నాయకులు, సంఘ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ముగ్గుల పోటీలు

శ్రీకాకుళం : ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వివిజిఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎస్‌వి రమణమూర్తి, గ్రంథాలయ సిబ్బంది మురళీ కృష్ణమూర్తి, భానుమతి, రామ్మోహన్, ప్రత్యూష, కళ్యాణి, వరలక్ష్మి, శివ గణేష్, సరోజిని, తెలుగు ఉపాధ్యాయులు రామదాసు, ఉపాధ్యాయులు ఉషా, సోడవరపు ఈశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు: గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం శ్రీకాకుళం పట్టణానికి చెందిన మలిపెద్ది దేవేంద్ర ప్రసాద్ చేసిన మ్యాజిక్ షో విద్యార్థులను ఆకట్టుకుంది. కాగితాలను రూపాయి నోట్లుగా మార్చడం, రుమాలను పువ్వులుగా మార్చడం ద్వారా పిల్లలను ఆకట్టుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గాంధీ మహిళా సంఘం అధ్యక్షురాలు ఎం.వెంకటరమణమ్మ, గ్రంథాలయ సహాయకులు జి.గడ్డియ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలాకి: స్థానిక శాఖా గ్రంథాలయంలో విశ్రాంత గ్రంథాలయాధికారి బుచ్చి సుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి రమణమ్మ, సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీ నారాయణ, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్ కుమార్, మాజీ సర్పంచ్ ఎల్.రాంబాబు, ఈసర్ల చిన్ని, హరికృష్ణ, గ్రంథాలయాధికారి కె.మానస, లుకలాపు తాత, టి.శ్రీనివాసరావు, అర్జున్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాలకు సమతా మిదిలా విద్యాలయం ప్రిన్సిపాల్ ముద్దాడ ఇందుమతి పాల్గొన్నారు. తొలుత ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మలిపెద్ది చంద్రశేఖర్, సహాయకులు సూర్యనారాయణ, జగదీష్, పొన్నాడ సూరిబాబు, ప్రకాష్, సిమ్మ సూర్యనారాయణ మాస్టారు, బాన్న వెంకటరావు, విద్యార్థులు, పాల్గొన్నారు.

నందిగాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు సందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్. ఉదయ్ కిరణ్, ఎంపిటిసి ప్రతినిధి అంబొడి విష్ణు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జన్మదినోత్సవం సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో రాములమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు : స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని గ్రంథాలయాధికారి సిహెచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా దిశాచట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఇందిరాగాంధీ జయంతి, మహిళా దినోత్సవం ఆవశ్యకతపై తెలియజేశారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణ అధికారి తారకేశ్వరి, గ్రంథాలయాధికారి ఆర్ అనురాధ, నీలిమ, శ్వేత, భారతి, మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నౌపడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను గ్రంథాలయాధికారిని బి.రూపవతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.రవి, హెచ్ఎం అప్పలరాజు, బాలరాజు, జ్యోతి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా ఇందిరాగాంధీ జయంతిని పురష్కరించుకొని మహిళా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులకు రంగవల్లి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్వర్ణభారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ ఆశ గౌరిశంకర్‌రెడ్డి, గ్రంథాలయాధికారి పూర్ణ పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు సంతోష్‌కుమార్, గ్రంథాలయాధికారి రాం బాబు పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక గ్రంథాలయంలో తహశీల్దార్ కురమాన ప్రవల్లిక ప్రియ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రంగవళ్లల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి బి.రూపావతి, విశ్రాంత గ్రంథాలయాధికారి గున్న ప్రసాదరావు, సహాయకురాలు ఎస్. అమ్మనమ్మ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పిసిసి ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. ఆదివారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పట్టణంలో గేటులో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో సమానంగా విప్లవాత్మక నిర్ణయాలతో ప్రజల మనసులో చిరస్థాయిగా ఇందిరగాంధీ నిలిచిపోయారని కొనియాడారు. మూడుతరాలు దాటినప్పటికీ నేటికీ ప్రజలు ఇందిరమ్మ ఇల్లు అని చెప్పుకుంటున్నారని అదే కాంగ్రెస్ ఘనతని అన్నారు. దేశం, రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, ఇటువంటి తరుణంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, మాజీ ఎంపిపి బొడ్డేపల్లి గోవింద గోపాల్, ప్రధాన కార్యదర్శి లఖినేని నారాయణరావు, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ బస్వా షణ్ముఖరావు, మాజీ కౌన్సిలర్ కూన సుందరరావు, లఖినేని సాయిరాం, సనపల వాసుదేవరావు, గురుగుబెల్లి కృష్ణారావు, దాలయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: ఇందిరా గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎచ్చెర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రి నాయుడు అన్నారు. భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ 106వ జయంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేసారన్నారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ కె.లక్ష్మీ, కె.జోగినాయుడు, రమణ, గణేష్ పాల్గొన్నారు.

టెక్కలి: బారతదేశాన్ని తిరిగి అభివృద్ధిలో నడిపే ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందిరాగాంధీ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ ప్రజలకోసం పనిచేస్తుందన్నారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కోత మధుసూదనరావు, ఐటిసెల్ విభాగం అధ్యక్షులు భాస్కరబాబు, పొట్నూరు ఆనందరావు, శాసుమహంతి ధర్మారావు, విశ్రాంత ఉపాధ్యాయులు చింతాడ పార్వతీశం, మాజీ సైనికుల సంఘం నాయకులు సత్తారు ఉగాది, లక్ష్మీపతి, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆమదాలవలస : పూలమాలవేసి నివాళ్లర్పిస్తున్న సత్యవతి తదితరులు

అచ్చెన్నకు మతిభ్రమించింది

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

చింతాడ మంజు

వైసిపి సామాజిక సాధికారత బస్సుయాత్ర నియోజకవర్గంలో విజయవంతం అవ్వడంతో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుకు మతి భ్రమించిందని వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చింతాడ మంజు అన్నారు. ఆదివారం విలేకరుతో మాట్లాడారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నాలుగున్నరేళ్లగా నియోజకవర్గ ప్రజలను పట్టించుకోని అచ్చెన్నాయుడు ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మీడియాలో కనిపించాలనే తపనతో అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. టిడిపి పాలనలో టిడిపి నేతలు మద్యం దోపిడీలకు పాల్పడి కోట్లాది రూపాయలు దోచుకున్నారని దుయ్యబట్టారు.

రోగులకు పళ్లు పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి జన్మదినం సందర్భంగా ఆదివారం టెక్కలి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, సిబ్బందికి పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, ఎంపిటిసి శ్రీధర్ రెడ్డి, చింతాడ పార్వతేశం, టిబిజి.గుప్త, జీవన్, గోరింట కృష్ణ, బొడ్డేపల్లి శ్రీను, బమ్మిడి లక్ష్మీపతి, పప్పల మాధవ్, హరీష్, కళా, సతీష్,, కార్తిక్ యాదవ్, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

టెక్కలి: మాజీ కేంద్ర సహాయ మంత్రి, వైసిపి మహిళా నాయకురాలు డాక్టర్ కిల్లి కృపారాణి జన్మదిన వేడుకలు ఆదివారం ఆమె నివాసంలో ఘనంగా నిర్వహించారు. అభిమానుల మధ్య ఆమె కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, అక్కవరం సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మీ అప్పలనాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు చింతాడ పార్వతీశం, మోదుగువలస గణపతిరావు, టెక్కలి మాజీ సర్పంచ్ టంకాల పావనీరాణి, టి.బి.జె.గుప్త, వైసిపి మహిళా నాయకులు చింతాడ మంజు, శ్రీధర్ రెడ్డి ఉన్నారు.

'వి ఫర్ నీడీ' ఆర్థికసాయం

సంతబొమ్మాళి: గతంలో భర్త, ఇటీవల ప్రమాదంలో ఒకేఒక్క కుమారుడుని కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతున్న నరసన్నపేట మండలం తెలగవలస గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధ మహిళ పట్నాన ఆదిలక్ష్మికి అమెరికాకు చెందిన 'వి ఫర్ నీడీ' సంస్థ రూ.20వేలు ఆదివారం ఆర్థికసాయం చేశారు. ఈ మొత్తాన్ని మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ వల్లేవలస ప్రతినిధులు రెడ్డి సూరిబాబు మాస్టర్, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, జగదీష్, సాయిబాబా వల్లేవలస గ్రామంలో అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు భరత్, శివ, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్ఆర్ విగ్రహానికి శంకుస్థాపన

సంతబొమ్మాళి :మండల పరిషత్ ఆవరణలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహ ప్రతిష్ఠకు జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి రాజేశ్వరి, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు జీరు బాబూరావు, నాయకులు నక్క భీమారావు, మార్పు నాగభూణరావు, రెయ్య రామిరెడ్డి, బుడ్డా మోహన్‌రెడ్డి, కోత సతీష్, కళింగపట్నం అప్పారావు, గంట ఈశ్వరరావు, ధూబ వేణు, శిమ్మ సోమేశ్వరరావు, సూరాడ రాజారావు, బి.సుధాకర్, సూరాడ వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి వసంత రెడ్డి

'ఆఫ్‌షోర్'కు అప్పయ్యదొర పేరు పెట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది బాలకృష్ణ

పలాస : మండలం రేగులపాడు ఆఫ్‌షోర్ రిజర్వాయర్ త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని, ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు అప్పయ్యదొర నామకరణం చేయాలని ప్రముఖ న్యాయవాది వరిశ బాలకృష్ణ అన్నారు. దివంగత ఎంపి హనుమంతు అప్పయ్యదొర బాటలో నడిస్తే మంచి నాయకులుగా గుర్తింపు పొందుతారని, ఆ దిశగా ప్రయాణం చేయాలని హనుమంతు విజయకుమార్ దొర (చిట్టి)కు సూచించారు. కాశీబుగ్గ అప్పయ్య దొర ఇంటి వద్ద ఆదివారం నిర్వహించిన దొర అభిమానుల ఆత్మీయసభ విజయవంతమైంది. ఈ సభలో బాలకృష్ణ మాట్లాడుతూ అప్పయ్యదొర పదవుల కోసం రాజకీయం చేయలేదని, ప్రజల సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు చేసి మంచి నాయకుడిగా నిలిచారన్నారు. దొర పెట్టిన బిక్షవల్లే తాను ఈ స్థానంలో ఉన్నానన్నారు. దొర తనయుడుగా పుట్టడం చిట్టిదొర ఆదృష్టమన్నారు. అప్పయ్యదొర తనయుడు విజయకుమార్ దొర మాట్లామడుతూ మన ప్రాంతానికి దొర దేవుడు ఇచ్చిన దైవమని, దొర జెండాయే మా అజెండా అని, ఈ సభ ఎంతో విజయవంతం కావడం తనకు మరింత మనోధైర్యం, ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. సమావేశంలో సినీ నిర్మాత బలగ ప్రకాష్, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి చాపర సుందరలాల్, డాక్టర్ వై.రామినాయుడు. మజ్జి పున్నయ్య, పైల జవహర్, మరడ భాస్కరరావు, వెంకటరావు, మూర్తి, సిర్ల రవిచంద్ర పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిపిఎస్ విధానాన్ని అంగీకరించబోమని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కారదర్శి కొప్పల భానుమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల-1లో ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు మొగదాల రమణరావు ఆధ్వర్యంలో ఆదివారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ నెంబర్ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, జిల్లా కార్యదర్శులు డి.వీరయ్య, పి.లక్ష్మణరావు, ఎం.గంగేశ్వరి, రాష్ట్ర కౌన్సిలర్లు కె.విజయ్‌కుమార్, బొంతు అప్పలనాయుడు, జి.సిగడాం ప్రధాన కార్యదర్శి కిలారి వెంకటరమణ, దండా సూరిబాబు, పి.వి.నరసింహారావు, పి.వి.రమణారావు, దుంప రవికుమార్, కల్లూరు రంగారావు దుబాకుల శ్రీనివాసరావు, పప్పల రమణమూర్తి, పొన్నాడ అప్పారావు, లోలుగు వెంకటేష్, వి.వి.గోవిందరావు, పాసపు సత్యారావు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న మండలశాఖ సభ్యులు

నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక..

మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మొదగాల రమణారావు, ప్రధాన కార్యదర్శిగా పొన్నాడ తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా దుంపల శ్రీనివాసరావు, గురుగుబెల్లి శ్రీనివాసరావు, గుడిశా జవహార్‌గుప్తా, చింతాడ విజయబాల, కార్యదర్శులుగా రఘుపతి రఘువునాయుడు, దండా శ్రీనివాసరావు, పైడి రవిబాబు, వంబర శ్రీనివాసరావు, పొన్నాడ ద్రాక్షాయణిలను ఎన్నుకున్నారు.

దక్షిణ భారతస్థాయి పోటీలకు నాటిక ఎంపిక

నందిగాం :భారత ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25, తేదీల్లో కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో మోక్షగుండం విశ్వేశ్వరయ్య సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియంలో నిర్వహించనున్న 23వ జాతీయ సైన్స్ డ్రామా ఉత్సవాలకు మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన రుదిరయాన్ నాటిక ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూఢనమ్మకాలు అనే అంశంలో భాగంగా రుధిరయాన్ ఆనే నాటిక రూపొందించబడి జిల్లా స్థాయిలో ప్రదర్శించిన నాటిక రాష్ట్రస్థాయిలో ప్రధమస్దానం సంపాదించి, జాతీయ స్థాయికి ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా నాటిక రచయిత మూల తాతయ్య, దర్శకులు దూసి ఆంధ్రాస్టాలిన్, ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావును జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఉప విద్యాశాఖాధికారిణి గార పగడాలమ్మ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుమల చైతన్య, జిల్లాసైన్స్ ఆధికారి ఎన్.కుమారస్వామిలు అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటిక జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు బాలక రామారావు, తులసిప్రసాద్, రంకిడి రామారావు, బెందాళం రత్నం, బి,వి.వి.కె ప్రియదర్శినీ, ఎన్. గోవిందరాజు, యాగాటి త్రినాధరావు, గ్రామ సర్పంచ్ బొంగు అమ్ములమ్మ అభినందించారు.

టిడిపితోనే అభివృద్ధి

ఆమదాలవలస :టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాజీ కౌన్సిలర్ గురుగుబెల్లి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని పురపాలక సంఘంలో 23వ వార్డు లక్ష్ముడుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే 6 గ్యారంటీ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కూన ఆంజనేయులు, పప్పల కృష్ణ, వమరవెల్లి శ్రీనివాసరావు, పేడాడ రమేష్, కూన లక్ష్మణరావు, గురుగుబెల్లి తేజేశ్వరరావు, శ్రీనివాసరావు, వెదుళ్లవలస సుందరరావు, అన్నెపు రమణమూర్తి, ఎన్ని జయరాం పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న నాగేశ్వరరావు

వెలుగు సిఎఫ్ తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- నౌపడ

మండలం నౌపడ పంచాయతీ పాలనాయుడుపేట గ్రామ సమైక్య సంఘానికి చెందిన వెలుగు సిఎఫ్ పి.సుమలతను గ్రామసమైక్య సభ్యులు ఆదివారం తొలగించారు. వెలుగు సిఎఫ్ చేతివాటం అనే శీర్షిక శనివారం ప్రజాశక్తిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. గ్రామసమైక్య సంఘం సభ్యులందరూ ఎపిఎం సూర్యనారాయణ ఆధ్వర్యంలో నౌపడ పాలపోలమ్మ తల్లి ఆలయం వద్ద సమావేశమయ్యారు. సిఎఫ్‌పై వచ్చిన అవినీతి వాస్తవమని తేలడంతో సంఘసభ్యులంతా తొలగిస్తున్నట్లు తీర్మానం చేసి కాపీని అధికారులకు అందజేశారు. దీంతో సిఎఫ్ సుమలతను తొలగిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు.

ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

క్షతగాత్రునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో అన్నంపేట గ్రామానికి చెందిన ఆచంట ఉమామహేశ్వరరావుకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడికాలు విరిగిపోయింది. దీంతో ఆయన ఏ పని చేయలేక ఇంటికి పరిమితమై ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో అదే గ్రామానికి చెందిన స్నేహితులందరూ ఒక్కటై కాలుపోయి బాధపడుతున్న క్షతగాత్రుడు ఉమామహేశ్వరరావు ఇంటికి వెళ్లి ఆదివారం పరామర్శించారు. నీకు మేమున్నాము అంటూ భరోసా ఇచ్చారు. రూ. 11,700 ఆర్థికసాయాన్ని అందజేశారు. కష్ట కాలంలో కలిసి చదువుకున్న మిత్రులు సాయం అందించి ఆదుకునే ఉదార స్వభావం గొప్పదని స్థానికులు అభినందించారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పాలవలస క్రీస్తు మందిరంలో విన్ సెండిపాల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ పేదల దినోత్సవం సందర్భంగా 20 మంది నిరుపేదలకు ఆదివారం వస్త్రాలను పంపిణీ చేశారు. సొసైటీ ప్రెసిడెంట్ జి. ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ సమాజంలో పేద, ధనిక అనే భేదం లేకుండా అన్ని వర్గాలు సమానంగా ఉండాలని, పేదరికం నిర్మూలన చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో విచారణ కర్తలు మహేంద్ర, నిర్మల దాసి, సభ్యులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలో అక్కవరం పంచాయితీ పరిధిలో అక్కవరం, శ్యాంసుందరాపురం గ్రామాలకు చెందిన సుమారు 62 మంది రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మీ అప్పలనాయుడు చేపట్టారు. ఖరీఫ్ వరిపంట అనంతరం రైతులు వేరుశనగ పంటపై దృష్టి పెట్టనుండడంతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం సరఫరా చేసిన వేరుశనగ విత్తనాలను అందించామని తెలిపారు. అర్హులైన రైతులు, విత్తనాలు అవసరం ఉన్న వారు రైతుభరోసా కేంద్రం వద్దకు వచ్చి తీసుకు వెళ్లాలని సూచించారు.

'ఎండలమల్లన్న'కు ముస్తాబు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని రావివలసలో ఎండల మల్లన్న దేశంలో పెద్దదైన స్వయంభూ శివలింగం కలిగిన శైవక్షేత్రం. ఇక్కడి ఆలయానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ఏటా కార్తీక మాసం నాలుగు సోమవారాల పాటు వేలాదిగా ఇక్కడికు యాత్రికులు దర్శనానికి వస్తారు. అలాగే శివరాత్రి పర్వదినాన స్వయంభూలింగందర్శనానికి పోటెత్తుతారు. ఉత్తరాంధ్రంతో పాటు ఒడిశా, చత్తీష్ఘడ్ రాష్ట్రాల నుంచీ యాత్రికులు తరలివస్తారు. కార్తీకమాసం ఉత్సవాలకు ఆలయంలో ఏర్పాట్లను ఇన్‌ఛార్జి ఇఒ జి.ప్రసాదబాబు యాత్రికులకు అసౌకర్యం కలగకుండా చేస్తున్నారు. సిఐ చంద్రమౌళి, ఎస్ఐ రామకృష్ణ నేతృత్వంలో బందోబస్తు సిద్ధం చేశారు.

గర్భిణులకు సీమంతాలు

ప్రజాశక్తి- బూర్జ

సత్యసాయి బాబా 98వ జయంతి వేడుకల్లో భాగంగా మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని లక్కుపురం గ్రామంలో సత్యసాయి మందిరంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఎంపిపి కర్నేన దీప ఆధ్వర్యంలో గర్భిణీలకు సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో సత్యసాయిసమితి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. సోంపేట జోన్ అధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 63 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 9మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సమితి కన్వీనర్ గోపాలరావు, సుబ్బారావు, జానార్ధనరావు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యాన...

స్థానిక రోటరీక్లబ్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బిపి, సుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వాసంతి ఆస్పత్రి సహాయ సహకారాలతో 123 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ సప్పటి రోహిత్, సెక్రటరీ మాచర్ల రాజకుమార్, వల్లంపటి సురేష్ కుమార్, దేవరపల్లి కృష్ణ, దక్కతా కృష్ణమూర్తి, నవీన్ చౌదరి, దేవరపల్లి గోపాల్, వాసంతి ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ డి.త్రినాధ్ రెడ్డి పాల్గొన్నారు.

కళావెంకటరావు పరామర్శ

ప్రజాశక్తి- జి.సిగడాం

మండల కేంద్రంలో ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న బూత్ ఇన్‌ఛార్జి నరవ అచ్యుతరావును టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు ఆదివారం పరామర్శించారు. ఆరోగ్యానికి సంబంధించి అచ్యుతరావుని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట మండల పార్టీ అధ్యక్షులు కుమరాపు రవికుమార్, మండల నాయకులు, కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

లావేరు : నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి- లావేరు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. ఆదివారం టిడిపి, జనసేన ఉమ్మడి కార్యాచరణలో భాగంగా గుంతలు ఆంధ్రప్రదేశ్‌కి దారేది కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారి అల్లినగరం కూడలి నుంచి ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామం వరకు వెళ్లే ప్రధాన రహదారి గత కొన్నేళ్లుగా పెద్ద గుంతలు పడి వాహనాలు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా, రహదారి మరమ్మతులు చేయకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ముప్పుడి సురేష్, ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ జెడ్‌పిటిసి పి.మధుబాబు, జి.మహేష్, ఎం. రామ్మూర్తి, జనసేన నాయకులు దుర్గారావు, కోలా రాజేష్, రాజారమేష్, బస్వా గోవిందరెడ్డి, కాకర్ల బాబాజీ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: రహదారులను గాలికొదిలేసిన అసమర్థ ప్రభుత్వం రాష్ట్రంలో పరిపాలన కొనసాగిస్తుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జనసేన, టిడిపి సంయుక్తంగా గుంతల ఆంధ్రప్రదేశ్‌కి దారేది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్, ప్రధాన రహదారిపై ఉన్న గుంతల వద్ద కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యం, టిడిపి మండల అధ్యక్షుడు అంబల్ల రాంబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్, నందివాడ గోవిందరావు, కొమనాపల్లి రవికుమార్, కె.సూర్యనారాయణ, ధవళ సింహాచలం, పివి.రమణ, సునీత పాల్గొన్నారు.

మెళియాపుట్టి : రోడ్డు దుస్థితిని పరిశీలిస్తున్న నాయకులు

మెళియాపుట్టి: మెళియాపుట్టిలో శిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం మామిడి గుడ్డి రహదారి దుస్థితిని పరిశీలించారు. అధ్వానంగా ఉన్న రోడ్లను పరిశీలించి ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ, జనసేన మండల అధ్యక్షులు దుక్క బాలరాజు, బసవ పరమేశ్వర్ రెడ్డి, మాలతి శ్రీధర్, ఉర్లాన వసంత్, కంచరాన సాయికుమార్, ప్రశాంత్, పిట్ట హరికృష్ణ, సోలాపురం చంటి, పడాల శ్రీను, వట్టికోళ్ల చక్రి, టిడిపి, జనసేన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పోలాకి: గుంతల ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మగతాపాడు నుంచి శివరాంపురం, గుప్పడిపేట నుంచి చిన్న కొవిరిపేట రోడ్డులో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పోలాకి మండల అధ్యక్షులు నందుపల్లి దండాసి, మండల ప్రధాన కార్యదర్శి వారది వరలక్ష్మి, గుంటు అప్పలస్వామి, చెక్క నాయుడు, చెక్క కొర్లయ్య, టిడిపి నాయకులు నందుపిల్లి జోగారావు, యూనిట్ ఇన్‌ఛార్జి కరుకోల దృశ్యంత్, చెక్క మల్లేష్, కరుకు గురుభక్తులు, రోనంకి మోహనరావు, నందుపిల్లి యర్రయ్య, జనసైనికులు, వీరమహిళలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మందస: మండలం జాతీయ రహదారి నెంబర్-16 నుంచి గొప్పిలి గారబంద రహదారికి అనుసంధానంగా ఉన్న పట్టు లోగాం -గుండ్రుగాం ఉన్న గిరిజన గ్రామాల మధ్యన ఉన్న ప్రధాన రహదారిపై కుసుమాల గ్రామం వద్ద జనసేన, టిడిపి ఉమ్మడిగా గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జనసేన పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి. దుర్గారావు, మందస మండల అధ్యక్షులు కుప్పాయి గోపాలరావు, కోన కృష్ణారావు, గుంట కిరణ్ కుమార్, తిరుపతి గౌడ్, మజ్జి శ్రీకాంత్, ఆనంద్, కంచరాణ అనిల్, డొక్కా లక్ష్మీనారాయణ, మెట్టూరు జ్ఞానేశ్వరరావు, టిడిపి నాయకులు నవీన్ యాదవ్, శంకరరావు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : నిరసనలో పాల్గొన్న జనసేన, టిడిపి నాయకులు

టెక్కలి: రాష్ట్రంలో ఆధికారం చేపట్టిన వైసిపి పాలనలో ఆబివృద్ధి కుంటుపడిందని కనీసం రోడ్లు వేయలేదు సరికదా, మరామ్మత్తులకు కూడా రోడ్లు నోచుకోలేదని తెలియజేస్తు గుంతలాంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమాన్ని టెక్కలిలో టిడిపి, జనసేన నాయకులు చేపట్టారు. మండలంలోని ఆయోద్యాపురం గ్రామంలో గుంతల రోడ్లుని పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్, హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, మండల మహిళా అధ్యక్షురాలు మెండ దమయంతి, కోళ్ల లవకుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

టెక్కలి: ఆయోధ్యాపురం రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

రథాన్ని లాగుతున్న యాత్రికులు

ఘనంగా జగన్నాథస్వామి రథయాత్ర

ప్రజాశక్తి- రణస్థలం

మండలం బంటుపల్లి గ్రామ జాతీయ రహదారి వద్ద ఎస్‌కెసిఎం గోసేవా ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీజగన్నాథస్వామి రథయాత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ప్రారంభించిన ఈ రథయాత్ర వేడుకలను బిజెపి విజయనగరం జిల్లా అధ్యక్షులు, ఎచ్చెర్ల నియోజకవర్గం కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్‌ఇఆర్) ప్రారంభించారు. టిడిపి సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు, గణపతిరావు రథాన్ని లాగారు. కార్తీక మాసంలో శ్రీ కృష్ణ చైతన్య మఠం గోసేవా ఆశ్రమం పీఠాధిపతి త్రిదండి స్వామి, కేశవ గోస్వామి మహారాజ్ ఆధ్వర్యంలో ప్రతిఏటా రథయాత్రను నిర్వహిస్తారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఒడిషాకు చెందిన యాత్రికులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందుకుంటున్న ఢిల్లేసు

యువజన అధ్యక్షునిగా ఢిల్లేసు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జాతీయ బిసి సంక్షేమ సంఘం ఇచ్ఛాపురం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడుగా ఢిల్లేసును నియమించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. సంఘ జిల్లా అధ్యక్షులు పిట్టా చంద్రపతిరావు ఈ నియామకం ప్రకటించారు. రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు చేతులమీదుగా అధ్యక్షుడు పులారి ధర్మాదన సమక్షంలో అందుకున్నారు.

బోసిపోయిన టెక్కలి

ప్రజాశక్తి- టెక్కలి

ఇండియా- ఆస్ట్రేలియా వరల్డ్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా డివిజన్ కేంద్రమైన టెక్కలి పట్టణం ఆదివారం బోసిపోయింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచే ప్రధాన వీధులు, రోడ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. పట్టణంలో చాలాచోట్ల వీధుల్లో చిన్నపాటి గోడలపై తెల్లటి సున్నం వేసి ప్రొజెక్టులు ఆమర్చి క్రికెట్‌మ్యాచ్‌ని వీక్షించారు. పట్టణంలో సినిమా థియేటర్‌లు తెరిచినప్పటికీ ప్రేక్షకులు లేక థియేటర్‌లు బోసిపోయాయి. వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్ కావడంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆసక్తి కనపర్చారు. కాగా మహిళలు కూడా మ్యాచ్‌పై ఆసక్తి కనపర్చడం గమనార్హం. మధ్యాహ్నం వ్యాపార దుకాణాలు వినియోగదారులు లేక బోసిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుని మ్యాచ్‌ని తిలకించారు. ప్రపంచకప్ పోటీ సందర్భంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో పాటు ప్రత్యక్ష, పరోక్ష బెట్టింగ్‌లు కూడా జోరెక్కాయి. ఏదిఏమైనా వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ఆభిమానులు టీవీలకు, సెల్‌ఫోన్లుకు ఆతుక్కుపోయారు.

బోసిపోయిన దుకాణాలు

పిక్నిక్ సందడి

బహుమతులను అందజేస్తున్న సంఘ సభ్యులు

ప్రజాశక్తి- కవిటి: కార్తీక మాసం పురస్కరించుకుని వన భోజనాల సందడి మొదలైంది. చాలా రోజుల తరువాత అందరూ ఏకమై ఆనందంగా సందడి చేస్తున్నారు. పల్లెలు శోభాయమానంగా వెలుగుతున్నాయి. శైవ, వైష్ణవ ఆలయాలు వేకువ జామునుంచే భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

నరసన్నపేట: స్థానిక శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో శిష్టకరణ పిక్నిక్ నరసన్నపేట జిసి హోమ్ తోటలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శిష్టకరణ సంఘ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు కృష్ణ అధ్యక్షతన జరిగింది. సంఘం అభివృద్ధికి పలు నిర్ణయాలను తీసుకున్నారు. పేదలకు నూతన వస్త్రాలను పంపిణి చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు సదాశివుని కృష్ణ, ఎంవిజె మోహనరావు, అంపలాం వసంతకుమార్, సంఘం నాయకులు కసప ప్రసాదరావు, ఝూన్సీశ్రీను, ఊర్లం పార్వతేశ్వరరావు, ఆర్.వైకంఠరావు, కుప్పిలి వైకంఠరావు, కో-ఆర్డినేటర్లు సదాశివుని సింహాచలం, చౌదరి రవి, నందిగామ కృష్ణ, డబ్బీరు రవి, రమణబాబు కృష్ణమోహన్, బలివాడ రాము, వెంకుమహంతి మధు డబ్బీరు వెంకటరమణ పాల్గొన్నారు.

వన భోజనాలు చేస్తున్న యువత

గోతులమయమైన రహదారి

అధ్వానంగా ఉన్న రామచంద్రాపురం-పురుషోత్తపురం రహదారి

- ఇక్కట్లు పడుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న పాలకులు, అధికారులు

ఆమదాలవలస

మండలంలో అలికాం-బత్తిలి రోడ్డు నుంచి పొన్నంపేట రామచంద్రపురం మీదుగా పురుషోత్తపురం గ్రామం వరకు వెళ్లే రహదారి గోతులమయంగా మారి ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నప్పటికీ పాలకులు, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని ప్రభుత్వం పలుమార్లు చెబుతున్నప్పటికి మాటలకే పరిమితమైందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 6 కిలోమీటర్లు రహదారి అత్యంత దారుణ పరిస్థితిలో ఉందని, తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెవ్వాకులపేట వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయడంతో అక్కడి నుంచి ప్రతిరోజు వందల కొద్ది లారీలు ఇసుకను తరలిస్తుండడంతో రహదారి గోతులమయంగా మారిపోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే బయపడుతున్నారని, ప్రతిరోజు రాళ్లుతేలిన రహదారిపై ప్రయాణిస్తుంటే సైకిళ్లు మరమ్మతులకు గురై సకాలంలో పాఠశాలలకు చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. పొన్నాంపేట, పొన్నాంపేటకాలనీ, రామచంద్రాపురం, చిట్టీవలస, చెవ్వాకులపేట, అలమాజీపేట తదితర 8 గ్రామాల ప్రజలు రహదారి లేక నానా ఇబ్బందులకు గురవుతున్నారు. గతేడాది రోడ్లు, భవనాల శాఖ అధికారులు రహదారికి ప్యాచ్‌వర్క్‌లు చేసి మమా అనిపించేసారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మించి సుమారు 8 సంవత్సరాలపైన కావస్తుందని నేటికీ శాశ్వత రహదారి నిర్మించకుండా గడచిన మూడు సంవత్సరాలుగా రహదారికి మరమ్మత్తులు చేస్తూ ఎటిఎంలా వినియోగించుకుని ప్రజల సొమ్మును కాజేసారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రజలు పడుతున్న కష్టాలను గ్రహించి నూతన రహదారిని నిర్మించి ప్రజల కష్టాలను తీర్చాలని పలుగ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.